క్లుప్తంగా

కోర్టు కార్యకలాపాలకు భవనాల పరిశీలన



బీపీఎల్ షోరూం భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు జడ్జి శైలజ

హిందూపురం అర్బన్: పట్టణంలోని కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనాలు నిర్మించే వరకూ మరోచోట కోర్టు కార్యకలపాలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. శనివారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయ ఆవరణలో నిర్మించిన నూతన భవనాన్ని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి పరిశీలించారు. అయితే అధికార యంత్రాంగానికి ఈ భవనాన్ని గుత్తేదారులు అప్పజెప్పలేదు. దీంతో పాత బీపీఎల్ షోరూం భవన సముదాయాన్ని తాత్కాలికంగా కోర్టు కార్యకలాపాలకు వినియోగించే అవకాశం ఉంది. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఏజీపీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్‌సాబ్జీ మృతి తీరనిలోటు



ఎమ్మెల్సీ షేక్‌సాబ్జీ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

పెనుకొండ: రోడ్డు ప్రమాదంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్‌సాబ్జీ మృతి చెందడం బాధాకరమని శ్రీసత్యసాయి జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్సీ షేక్‌బాబ్జి చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులు నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు పాటుపడుతామని పేర్కొన్నారు.

కల్వర్టు పనుల్లో వేగం పెంచాలి



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లేపాక్షి: మండలంలోని బయన్నపల్లి సమీపంలో జరుగుతున్న కల్వర్టు పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి శనివారం పరిశీలించారు. మూడు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోవడంతో బయన్నపల్లి, బసవనపల్లి, మామిడిమాకులపల్లి గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులతో మాట్లాడి కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. కల్వర్టు పనులు వేగవంతం చేసి, త్వరగా అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరామిరెడ్డి, మైనార్టీ సెల్ నాయకుడు ఇర్ఫాన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గర్భిణికి రక్తపరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

హిందూపురం టౌన్: రక్తహీనత దరిచేరకుండా విద్యార్థినులు, గర్భవతులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌ఓ, డీపీఎంఓ డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ అన్నారు. శనివారం మండలంలోని బేవినహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భవతులు, బాలింతలు, విద్యార్థినులతో మాట్లాడారు. రక్తహీనతను తేలికగా తీసుకోరాదన్నారు. విద్యార్థినులు, గర్భిణులకు ఐరన్ ట్యాబ్‌లెట్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు. అలాగే ఆరోగ్య కేంద్రాల్లో గర్భవతులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలందించడంలో అలసత్వం వహించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ ఎస్‌ఓ నాగరాజు, డీపీహెచ్‌ఎన్ ఈరమ్మ, డాక్టర్ పద్మజ, ఎంపీహెచ్‌ఈఓ మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్



పోలీసులకు పట్టుబడిన జూదరులు

పెనుకొండరూరల్: మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామ శివారులో శనివారం జూదం ఆడుతున్న పది మందిని కియా ఎస్‌ఐ రమేష్ బాబు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సృజనోత్సాహం!

- నందడిగా మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- వివిధ నమూనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

అమరాపురం: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడమే వైజ్ఞానిక ప్రదర్శన ఉద్దేశమని ఎంపీపీ ఈరన్న, ఎంఈఓ-2 వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని హాలుకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. మండలంలోని 8 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్, అంబేడ్కర్ గురుకుల పాఠశాలల విద్యార్థులు నమూనాలతో అలరించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు నమూనాలను పరిశీలించి, వివరణలు తీసుకున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు విద్యార్థులను సిద్ధం చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.

గుడిబండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శనను హెచ్‌ఎం మాధవరెడ్డి, కేఎం నరసింహమూర్తి, ప్రహ్లాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిన సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు రూపొందంచిన పలు ఆవిష్కరణలు ఆలోచింపచేసేలా ఉన్నాయని కొనియాడారు. అంతరిక్షయానం, తుపానులు, భూకంపాలు, వరదలు వాటి నియంత్రణ మార్గాలు సూచిస్తూ పాఠశాల విద్యార్థులు ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఆకట్టుకుంది. వివిధ రకాల వ్యర్థాలతో పాఠశాల విద్యార్థులు తయారు చేసిన క్రేన్లు, బ్రిడ్జిలు ఆకట్టుకున్నాయి.

మడకశిర: పట్టణంలోని మాతా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శనివారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఎంఈఓ భాస్కర్ ప్రారంభించి, విద్యార్థులు తయారుచేసిన నమూనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వస్తుందని తెలిపారు. ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 నరసింహమూర్తి, హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలోని మురళీ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మరుగు నీటి శుద్ధీకరణ చేసే విధానం, గాలి, నీటి కాలుష్యం, విసర్జక వ్యవస్థ, జియోమెట్రికల్ సిటీ, క్రైన్ వర్కింగ్ మడల్, జీవవైవిద్యం, పోషక పదార్థాలతో పాటు చిరుధాన్యాలతో నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. 70 మంది విద్యార్థులు తయారు చేసిన నమూనాలు చూపరులను ఆకట్టుకున్నాయి. హొట్టేబెట్ట జెడ్పీహెచ్‌ఎస్ నుంచి టి.దీక్ష, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల నుంచి వి.భానుప్రసాద్, కేజీబీవీ నుంచి ఇర్షత్‌ఉన్నీసా, జెడ్పీహెచ్‌ఎస్ కాకి నుంచి అక్షయ్, జెడ్పీహెచ్‌ఎస్ బీజీ హళ్లి నుంచి పునీత్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీధర్, మోహన్, బీజీ హెచ్‌ఎం యంజారప్ప, ప్రిన్సిపాల్ మైలారప్ప, హెచ్‌ఎంలు ఎం.వై.ప్రభాకర్, పి.ప్రభాకర్, ఏఓ యోగానంద్ పాల్గొన్నారు.



గుడిబండ జెడ్పీహెచ్‌ఎస్‌లో నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



అమరాపురంలో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ ఈరన్న, ఎంఈఓ-2 వెంకటరమణ నాయక్



మడకశిరలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓ భాస్కర్, ఉపాధ్యాయులు



రొళ్లలో మూత్రపిండాల నమూనాను పరిశీలిస్తున్న హెచ్‌ఎం యంజారప్ప

26న లక్ష దీపోత్సవం



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: జిల్లాలో ప్రసిద్ధి చెందిన హేమావతి సిద్దేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈనెల 26న లక్ష దీపోత్సవం జరగనుంది. శనివారం పట్టణంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 26న జరిగే లక్షదీపోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిప్పేస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, గుడిబండ ఎంపీపీ రాధమ్మ, మడకశిర మాజీ సర్పంచ్ ఎస్ఎస్ కృష్ణ మూర్తి, నాయకులు నాగభూషణ్ రెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

రొద్దం: మండల పరిధిలోని చెరుకూరు, కలిపి, పెద్దిపల్లి, దొడగట్ట ఆర్ లోచెర్ల గ్రామాల్లో శనివారం కందిలో పంట ప్రయోగాలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన కొలతల్లో కంది పంటను తొలగించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అనంతరం కందిని ఎండబెట్టి దిగబడి శాతాన్ని లెక్కిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ నివేదిత, ఏఈఓ అంజద్, వీఏఏ యోగేష్, ఇందుమతి, ఇన్సూరెన్స్ అధికారి మోహన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



పూలకుంట పంచాయతీలో నాయకులను కలిసిన వేణురెడ్డి

హిందూపురం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పోరాడుదామని పార్టీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. కలుద్దాం కలుపుకుపోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పూలకుంట పంచాయతీలోని పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ.. ఏ సమస్య వచ్చినా మీ ముందుండి పరిష్కరించడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని మట్టి కరిపించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామన్నారు. జగనన్న, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బహుమతిగా అందిద్దామన్నారు. అనంతరం గ్రామంలోని టీడీపీ మాజీ వైస్ ఎంపీపీ రెడ్డప్పరెడ్డి, శివశంకర్ రెడ్డిని ఆప్యాయంగా పలకరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తప్పకుండా సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాము, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మహేంద్రరెడ్డి, కౌన్సిలర్ నాగేంద్ర, నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, తిప్పేరుద్రయ్య, బసిరెడ్డి,ఆదేప్ప, భగీరథ నవీన్, చంద్రశేఖర్‌రెడ్డి, ఇలియాజ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం



వానవోలు తండాలో పథకాలను వివరిస్తున్న పార్టీ నాయకులు

గోరంట్ల: పేదల అభివృద్ధి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప కోరారు. శనివారం మండలంలోని వానవోలు తండాలో సర్పంచ్ పార్వతీ బాయి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా కలిగిన లబ్ధిని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, వానవోలు సహకార సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, స్థానిక వైసీపీ నాయకులు, రమణనాయక్, కృష్ణానాయక్, వాలంటీర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ సమావేశానికి తరలిరండి



సమావేశమైన వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు

పెనుకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లా లీగల్‌సెల్ సమన్వయ కమిటీ సమావేశానికి తరలిరావాలని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జోనల్ ఇన్‌చార్జి లోకేశ్వర రెడ్డి, అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు ఉమాపతి, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యక్రమంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి రావాలని ఏజీపీ భాస్కరరెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, తదితర న్యాయవాదులను ఆహ్వానించారు. ఈనెల 23న అనంతపురంలో ఉమ్మడి అనంతపురం జిల్లా లీగల్ సెల్ సమన్వయ సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇతర ముఖ్య నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మోహన్‌నాయక్, విక్రాంత్‌నాయక్, అశ్వర్థనారాయణ, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం



పూజలు చేస్తున్న అర్చకుడు

పావగడ: భాద్రపద మాసాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక శనీశ్వరాలయంలో శనిమహత్ముడికి తైలాభిషేక పూజలు వైభవంగా జరిగాయి. తొలుత శనీశ్వరుడికి నువ్వుల నూనెతో అభిషేకం చేశారు. ఆ తైలాన్ని తలకు రాసుకుంటే సర్వ పాపాలు తొలగిపోయి శనీశ్వర కటాక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం. అలాగే శీలాంభదేవికి కుంకుమ పూజలు జరిగాయి. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు 9 నల్లవత్తులు సమర్పించారు. అనంతరం అగ్నిగుండం చుట్టూ 9 సార్లు ప్రదక్షణలు చేశారు. ఆలయ సమితి అధ్యక్షుడు ఆనంరావు, కార్యదర్శి సుబ్బనరసింహ తదితర డైరెక్టర్లు భక్తులకు సేవలందించారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు



కదిరేపల్లిలో డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

మడకశిరరూరల్: కదిరేపల్లి సచివాలయానికి గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టామని సర్పంచ్ నర్సేగౌడు తెలిపారు. శనివారం కదిరేపల్లి గ్రామంలో రూ.3 లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డ్రైనేజీ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఎమ్మెల్యే తిప్పేస్వామికి విజ్ఞప్తి చేశారన్నారు. గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తామని అప్పట్లో ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగా కొడిగానిపల్లి, గుర్రప్పకొండ గ్రామాల్లో రూ.3 లక్షల చొప్పున కేటాయించి డ్రైనేజీ నిర్మాణ పనులు చేయిస్తామన్నారు. మిగిలిన నిధులతో కంబాలపల్లిలో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు.

కొలతలు సక్రమంగా ఉండాలి



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో త్రాసులకు సీలు వేస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని ప్రభుత్వ చౌకధాన్యపు డీలర్లు త్రాసులు, కొలతలు వేసే యంత్రాలకు తప్పనిసరిగా సీలు వేయించుకోవాలని హిందూపురం తూనికలు, కొలతలశాఖ అధికారి శివశంకర్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల వద్ద ఉన్న త్రాసులు, కొలతలు వేసే యంత్రాలకు సీలు వేశారు. ప్రతి సంవత్సరం సీలు వేయడం వలన కొలతల్లో మోసాలు లేకుండా నిత్యావసరాలను వినియోగదారులకు సక్రమంగా అందజేయవచ్చన్నారు.

ప్రశాంతంగా జీవించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ విజయ్ కుమార్

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద గ్రామస్తులతో ఎస్‌ఐ విజయ్ కుమార్ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఫ్యాక్షన్ , గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు. అదే విధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పేకాట, మట్కా, మద్యం క్రయ, విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

23న వైకుంఠ ఏకాదశి వేడుకలు



నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద పోస్టర్లు విడుదల చేస్తున దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 23న వైకుంఠ ఏకాదశి వేడుకలు జరగనున్నాయి. శనివారం సాయంత్రం ఆలయం వద్ద కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి సభ్యులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం ఆయా మండలాలకు పోస్టర్లు అందజేశారు.

బుళ్లసముద్రంలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం పంచాయతీ కేంద్రంలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. రాయలసీమ బీజేపీ కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదే విధంగా గ్రామాల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అర్హులందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోనిబాయి, ఈఓఆర్డీ శైలజ, ఏపీఓ శ్రీకాంత్‌గౌడు, ఏఈ భాస్కర్, అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా ఉమేష్

గుడిబండ: భారతీయ జనతా పార్టీ మండలాధ్యక్షుడిగా ఫళారం ఏంఆర్ ఉమేష్‌ను నియమిస్తూ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. తనపై నమ్మకం ఉంచి బీజేపీ మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరి, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ హనుమంతప్ప, నాయకులకు ఉమేష్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష ఫీజు వితరణ



మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్మన్ గోపాల్‌రావు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం పాఠశాల, సరస్వతీ విద్యా మందిరంలో 10వ తరగతి చదువుతున్న పేద విద్యార్థుల పరీక్ష ఫీజును లక్ష్మీబాయి, కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారు అందజేశారు. శనివారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు జగన్‌మోహన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ గోపాల్‌రావు మాట్లాడుతూ.. పేద విద్యార్థుల సహాయార్థం, పాఠశాల అవసరాల నిమిత్తం ఈ సంవత్సరం రూ.50 వేలు అందించామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సురేంద్ర, సభ్యుడు శ్రీనివాసమూర్తి, సరస్వతీ విద్యామందిరం విభాగ కోశాధికారి లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యనారాయణ శాస్త్రి, అశ్వర్థప్ప, ఉపాధ్యాయులు సిద్ధగిరి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

లేపాక్షి: ఎస్‌సీఈఆర్‌టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కళా ఉత్సవ్-2023 జిల్లాస్థాయి పోటీల్లో పులమతి జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల విజయవాడలోని మురళీ రిసార్టులో జరిగిన కళా ఉత్సవ్-2023 జిల్లాస్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని బి.వెన్నెల, 10వ తరగతి విద్యార్థి బి.కార్తీక్ డ్రామా సోలో విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గైడ్ టీచర్ రోజ్‌మేరీరాణి, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సురేష్‌కుమార్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

ఆలయ సమితి ఉపాధ్యక్షుడికి సన్మానం



నూతన ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

పావగడ: స్థానిక ఎస్ఎస్‌కే సంఘం నూతన ఉపాధ్యక్షుడు జి.అనిల్ కుమార్‌ను ఆలయ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. కార్యక్రమంలో వెంకటేష్, రాజేంద్ర ప్రసాద్, ఈరణ్ణ, సుధాకర్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సచివాలయం సిద్ధం



చిలమత్తూరు: మండలంలోని థామస్‌మన్రో తోపులో కోడూరు-2 గ్రామ సచివాలయ నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ సచివాలయ భవనానికి ప్రభుత్వం రూ.43 లక్షలు మంజూరు చేసింది. మండలంలో చిలమత్తూరు-1 సచివాలయాన్ని ప్రారంభించడంతో కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కోడూరు-2 సచివాలయాన్ని కూడా త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అధికారులు తెలిపారు.

గజరాజుకు ఘన నివాళి



గజరాజు అర్జున్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ వరదరాజు

పావగడ: మైసూరు దసరా ఉత్సవాల్లో 8 సార్లు అంబారి మోసి భక్తుల్లో ఉత్సాహం నింపిన గజరాజు అర్జున్ మృతికి చిహ్నంగా శనివారం స్థానిక తాలూకా కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఈనెల 4వ తేదీన హాసన్ జిల్లా అటవీ ప్రాంతంలో ప్రమాదవశాత్తూ గజరాజు మృతి చెందిన విషయం తెలిసిందే. తహసీల్దార్ వరదరాజు, ఇతర అధికారులు గజరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్య లోకేశ్, డ్రైవర్ ప్రసాద్, రంగనాథ్, పురుషోత్తమరెడ్డి, కేశవచంద్రదాస్, అటవీ శాఖ అధికారులు గంగరాజు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.